E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 09-05-2025 (వారం) శుక్రవారం హైదరాబాద్ పేజీలు–6
e-kaburu.com



విద్యుత్ సరఫరా నిలిపివేత.. సరిహద్దు రాష్ట్రాల్లో 'హై అలర్ట్'!
» 3లో




# పాకిస్థాన్ దాడులు.. తిప్పికొట్టిన భారత్

ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ దుస్సాహసానికి ఒడిగట్టింది. రెచ్చగొట్టే ధోరణిని మళ్లీ ప్రదర్శించింది. గురువారం రాత్రి క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలను మన దేశంపైకి ప్రయోగించింది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్‌లపైకి వాటిని వదిలింది.

తరువాయి 2లో

## ఈ కబురు:యుద్ధ విమానాలతో దాడికి పాక్ విఫలయత్నం

జమ్మూ, రాజస్థాన్, పంజాబ్‌లపైకి ప్రయోగం
విమానాశ్రయం, సైనిక కేంద్రాలే లక్ష్యం..
ఆత్మాహుతి డ్రోన్లను ప్రయోగించిన శత్రు దేశం
3 ఫైటర్ జెట్లసహా అన్నింటినీ చిత్తుచేసిన భారత సైన్యం
మనకు ఎటువంటి నష్టమూ జరగలేదు: రక్షణశాఖ
ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లో బ్లాక్అవుట్
ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని ప్రజలకు హెచ్చరిక
ధర్మశాలలో ఐపీఎల్ మ్యాచ్ అర్ధంతరంగా రద్దు
ప్రధాని మోదీకి పరిస్థితిని వివరించిన డోభాల్
దిల్లీలో హై అలర్ట్.. దేశవ్యాప్తంగా అప్రమత్తత
తొలుత 15 చోట్ల దాడులకు పాక్ పన్నాగం
ముందుగానే గుర్తించి అడ్డుకున్న మన సైన్యం
పాకిస్థాన్ రక్షణ వ్యవస్థల ధ్వంసం
దిల్లీ - జమ్మూ



## తొలిసారిగా ఎస్-400 ప్రయోగం!

భారత సైన్యానికి చిక్కిన పైలట్ ,100 శాతం స్ట్రైక్ రేట్తో పాక్ క్షిపణులు, అనంతరం విదేశాలకు పారిపోయినట్టు వార్తలు,కరాచీపై విరుచుకుపడిన నౌకాదళం.. పోర్టు ధ్వంసం ,పాకకు చెందిన ఎఫ్-16, రెండు జేఎఫ్-17 ఫైటర్ జెట్స్ నేలమట్టం ,పాక్ ప్రధాని ఇంటి సమీపంలో పేలుడు.. బంకర్ లోకి షెహబాజ్ షరీఫ్ ,పాక్ చర్యకు ప్రతిగా లాహోర్, ఇస్లామాబాద్, సియాల్ కోట్, పెషావర్ పై దాడి ,డ్రోన్లు ధ్వంసం 15 సైనిక స్థావరాలపై దాడికి దాయాది దేశం ప్రయత్నం తిప్పికొట్టిన భారత్,పాకిస్థాన్‌కు చెందిన ఓ ఎఫ్-16 యుద్ధ విమానాన్ని భారత గగనతల రక్షణ వ్యవస్థ కూల్చివేసినట్లు తెలిసింది.

తరువాయి 2లో



తరువాయి 2లో




## మా సహనాన్ని పరీక్షించొద్దు
### పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ వార్నింగ్

భారత్ సహనాన్ని అవకాశంగా తీసుకోవాలని ఎవరైనా ప్రయత్నిస్తే నిన్నటి మాదిరి (ఆపరేషన్ సిందూర్) పరిణామాలకు సిద్ధంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ హెచ్చరించారు.

ఈ కబురు: పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో భారత్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టేందుకు పాక్ యత్నించగా.. వీటిని భారత దళాలు దీటుగా తిప్పికొట్టాయి. ఈ క్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సహనాన్ని అలుసుగా తీసుకుంటే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. 'నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్'లో మాట్లాడుతూ దేశభద్రతకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టంచేశారు. "మేం ఎల్లప్పుడూ సంయమనంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాం. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడాన్ని విశ్వసిస్తాం.

» 2లో



## ఉద్రిక్తతలకు తెరలేపింది పాకిస్థానే 'ఆపరేషన్ సిందూర్'పై భారత్

ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలకు తొలుత పాకిస్థాన్ తెరలేపిందని భారత్ మరోసారి స్పష్టం చేసింది.

ఈ కబురు: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని, సైనిక స్థావరాలు కాదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తలకు తొలుత పాకిస్థాన్ తెరలేపిందని పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గాంలో పాక్ ఉగ్రమూకల దాడితో ఇది మొదలైందని తెలిపింది. అంతర్జాతీయ సమాజానికి దాయాది దేశం తప్పుడు సమాచారం అందిస్తోందని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈ వివరాలు వెల్లడించారు.

**ఐరాసకు ఆధారాలు..**

"పహల్గాం దాడులకు తామే బాధ్యులమని టీఆర్ఎఫ్ రెండుసార్లు ప్రకటించుకుంది. మరోవైపు.. తమ దేశంలో ఉగ్రవాదులు లేరని పాక్ చెబుతోంది. టీఆర్ఎఫ్ అనేది లష్కరే తొయిబా ముసుగు సంస్థ అని ఎన్నోసార్లు చెప్పాం. ఐరాసలో పహల్గాం ఉగ్రదాడి చర్చల్లో టీఆర్ఎఫ్ పాత్రను పాక్ వ్యతిరేకించింది. అయితే, దీనిపై తగిన ఆధారాలను ఐరాసకు ఇప్పటికే అందించాం. ఆ సంస్థ గురించి వివరించాం'' అని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు.

తరువాయి 3లో

## అఖిలపక్ష భేటీ.. మోదీ సందేశం వినిపించిన రాజ్‌నాథ్ సింగ్

» 2లో

## భారత్ వైపు కన్నెత్తి చూస్తే.. భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే: సీఎం రేవంత్ హెచ్చరిక




ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత సార్వభౌమత్వం మీద దాడి చేయాలని చూసేవారికి ఈ భూమ్మీద నూకలు చెల్లినట్లేనని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.


ఈ కబురు,హైదరాబాద్: ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత సార్వభౌమత్వం మీద దాడి చేయాలని చూసేవారికి ఈ భూమ్మీద నూకలు చెల్లినట్లేనని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా హైదరాబాద్‌లో చేపట్టిన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉగ్రమూకలకు ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ''పాక్ ఉగ్రవాదులు, పాక్ పాలకులు, అంతర్జాతీయ ముఖచిత్రంలో ఉన్న ఏ దేశమైనా సరే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత సార్వభౌమత్వంపై దాడి చేయాలనుకొని.. భారత్ వైపు కన్నెత్తి చూస్తే ఈ భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే. భూమ్మీద మీరు నివసించేందుకు అర్హత కోల్పోయినట్లే. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు ఉండొచ్చు. భిన్న సిద్ధాంతాలు ఉండొచ్చు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ఉగ్రవాదుల పీచమణిచేందుకు ఏ చర్య తీసుకున్నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇదీ భారతీయుల స్ఫూర్తి'' అన్నారు.

» 3లో

ధర్మశాలలో బ్లాక్ అవుట్..?పంజాబ్ కింగ్స్, ఢిల్లీ మ్యాచ్ రద్దు
» 6లో




బ్రిటన్ వజ్రాలపై సుంకం కోత లేదు
» 4లో



మాతృత్వపు ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా: దీపికా పదుకొణె
» 5లో



ఐపీఎల్2025లో ఓ మార్పు
» 6లో





ఆపరేషన్ సిందూర్... దేశ ఐక్యతకు నిదర్శనం రవీందర్ యాదవ్
» 3లో

మొదటి పేజీ తరువాయి

# పాకిస్థాన్ దాడులు.. తిప్పికొట్టిన భారత్



## జమ్మూ నగరంపైకి పాకిస్థాన్ ప్రయోగించిన డ్రోన్లు

ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ దుస్సాహసానికి ఒడిగట్టింది. రెచ్చగొట్టే ధోరణిని మళ్లీ ప్రదర్శించింది. గురువారం రాత్రి క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలను మన దేశంపైకి ప్రయోగించింది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్‌లపైకి వాటిని వదిలింది. జమ్మూ విమానాశ్రయంతోపాటు సరిహద్దుల్లోని పలు సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది. 35 నిమిషాలపాటు సాగిన ఈ ప్రయత్నాలను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. 8 డ్రోన్లను, 3 ఫైటర్ జెట్లను కూల్చేసింది. పాక్ పైలట్‌ను భారత సైన్యం బందీగా పట్టుకుంది. పాక్ దుస్సాహసంపై జాతీయ భద్రతా సలహాదారు అజీత్ దోభాల్ సమీక్షించారు. అనంతరం ఆయన పూర్తి వివరాలను ప్రధాని మోదీకి తెలియజేశారు. పాక్ దాడి తర్వాత ఫైసలాబాద్, సర్గోదాల్లోని ఆ దేశ రక్షణ వ్యవస్థలను భారత్ ధ్వంసం చేసింది. వాస్తవానికి బుధవారం రాత్రి నుంచీ దాడులకు ప్రయత్నిస్తున్న పాకిస్థాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడిచేయడానికి 15 లక్ష్యాలను ఎంచుకుంది. దీన్ని ముందుగానే పసిగట్టిన భారత్ ఇంటిగ్రేటెడ్ కౌంటర్ మానవ రహిత ఎయిర్‌క్రాఫ్ట్ వ్యవస్థ (గ్రిడ్ అండ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు)తో విజయవంతంగా అడ్డుకుంది. పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లోని గగనతల రక్షణకు సంబంధించిన రాడార్లను, వ్యవస్థలను భారత్ గురువారం ఉదయం ధ్వంసం చేసింది. పాక్ రాజధాని నగరం ఇస్లామాబాద్‌లో గురువారం సైరన్ల మోత మోగింది. అదే సమయంలో ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కార్యాలయంలో సమావేశం జరుగుతుండటం గమనార్హం. గురువారం రాత్రి పాక్ మళ్లీ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. జమ్మూ, ఉధంపుర్, అఖ్నూర్, పూంఛ్, రాజస్థాన్‌లోని జైసల్మేర్, పోఖ్రాన్, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, జలంధర్ లక్ష్యంగా పాక్ ఈ డ్రోన్లను ప్రయోగించింది. త్వారా, సాంబా, ఆర్‌ఎస్ పురాల్లో క్షిపణి దాడులకు పాక్ ప్రయత్నించింది. మ్మూ విమానాశ్రయం సహా పలు కీలక ప్రాంతాలవైపు డ్రోన్లు వచ్చాయి. దీంతో ప్రజలంతా వెంటనే ఇళ్లలోకి వెళ్లిపోయారు. దుకాణాలను మూసివేశారు. గగనతల రక్షణ వ్యవస్థ ఈ డ్రోన్లను విజయవంతంగా అడ్డుకుని కూల్చేసింది. జమ్మూ సిటీలో విద్యుత్తు సరఫరాను అధికారులు నిలిపేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థలు మూగబోయాయి. జమ్మూలో పలు సైనిక కేంద్రాలున్నాయి. విమానాశ్రయంవద్ద భారీ శబ్దాలు వినిపించాయని స్థానికులు తెలిపారు. మ్మూ యూనివర్సిటీకి సమీపంలో 2 పాక్ డ్రోన్లను భారత్ ధ్వంసం చేసింది.ఉరీలో పౌర నివాసాలే లక్ష్యంగా పాక్ దాడులకు తెగబడింది. జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడులు చేయాలని టెర్రరిస్టులకు పాక్ ఐఎస్ఐ సూచించింది. దీంతో అనంత్‌నాగ్‌లోని ఖుంద్రూలో ఉన్న ఆయుధ డిపోవద్ద పేలుళ్లకు వారు పాల్పడినట్లు సమాచారం. ఉద్రిక్తతల దృష్ట్యా అఖ్నూర్, కిశ్త్‌వాద్, సాంబా సెక్టార్‌లలో అధికారులు పూర్తిగా విద్యుత్ సరఫరాను నిలిపేశారు. జమ్మూ జిల్లా వ్యాప్తంగా సైరన్లు మోగిస్తున్నారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఐపీఎల్ మ్యాచ్‌ను భద్రతా కారణాలరీత్యా అర్ధంతరంగా రద్దు చేశారు.పలు రాష్ట్రాల్లో అధికారులకు సెలవులను ప్రభుత్వాలు రద్దు చేశాయి. విద్యా సంస్థలకు సెలవులిచ్చాయి. దిల్లీలో ప్రజలు ప్రముఖ ప్రదేశాల్లో తిరగడాన్ని నిషేధించారు. 'జమ్మూ, పఠాన్‌కోట్, ఉధంపుర్‌లను పాక్ డ్రోన్లు, క్షిపణులు లక్ష్యంగా చేసుకున్నాయి. వెంటనే వాటిని నిర్వీర్యం చేశాం. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు' అని రక్షణశాఖ అధికార ప్రతినిధి గురువారం రాత్రి తెలిపారు. అన్ని పారామిలిటరీ బలగాల డీజీలతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా మాట్లాడారు. పరిస్థితిని సమీక్షించారు. భారత సైనిక కేంద్రాలను పేల్చేశాం: పాక్ సరిహద్దుల్లోని భారత సైనిక కేంద్రాలను పేల్చేశామని పాకిస్థాన్ సమాచారశాఖ మంత్రి అత్తావుల్లా తరార్ స్కై న్యూస్‌తోపాటు సీఎన్ఎన్‌కు తెలిపారు. 40 నుంచి 50 మంది భారత సైనికులు చనిపోయారని వివరించారు. దీనిని భారత్ తీవ్రంగా ఖండించింది. అన్ని డ్రోన్లను అడ్డుకున్నామని స్పష్టంచేసింది. విద్యుత్తు నిలిపివేయడంతో అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయం పరిసరాల్లో అలముకున్న చీకట్లు పాక్‌లోని లాహోర్‌లో గురువారం పేలుళ్లు వినిపించాయి. వాల్టన్ ఎయిర్‌పోర్టు సమీపంలోని గోపాల్ నగర్, నసీరాబాద్ ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ శబ్దాలు వినిపించడంతో సైరన్ల మోత మోగింది. దీంతో సియాల్‌కోట్, లాహోర్ విమానాశ్రయాల్లో విమానాలను రద్దుచేశారు. ఈ పేలుళ్లు వినిపించిన ప్రాంతాల పక్కనే పాక్ ఆర్మీ కంటోన్మెంట్ ఉంది. 5 నుంచి 6 అడుగుల డ్రోన్ కూలిపోవడం కారణంగా ఈ పేలుడు సంభవించి ఉండొచ్చని స్థానిక అధికారులు వెల్లడించారు. కరాచీలోనూ ఈ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. భారత్ గురువారం జరిపిన డ్రోన్ దాడుల్లో ముగ్గురు మరణించారని, నలుగురు సైనికులు, 8మంది పౌరులు గాయపడ్డారని పాకిస్థాన్ ప్రకటించింది. లాహోర్, గుజ్రన్‌వాలా, చాక్వాల్, బహావల్‌పుర్, మియానో, కరాచీ, ఛార్, రావల్పిండి, అటోక్‌లలో ఇజ్రాయెల్ తయారీ 29 హారప్ డ్రోన్లను కూల్చివేశామని పాక్ సైన్యం అధికార ప్రతినిధి అహ్మద్ షరీఫ్ ఛౌదరి ప్రకటించారు. నాలుగు డ్రోన్లు లాహోర్ కంటోన్మెంట్ ప్రాంతంలో పడ్డాయని అధికారులు తెలిపారు. ఒక డ్రోన్ రావల్పిండి క్రికెట్ స్టేడియం దిశగా వచ్చిందని విదేశాంగశాఖ మంత్రి ఇషాక్ దార్ వెల్లడించారు. ఇస్లామాబాద్‌లో ఎటువంటి డ్రోన్ దాడులు జరగలేదని డిప్యూటీ కమిషనర్ నవాజ్ మెమన్ తెలిపారు. ఉద్యోగులంతా షెల్టర్‌లో ఉండాలని లాహోర్‌లోని అమెరికా కాన్సులేట్ సూచించింది. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తమ పౌరులకు సూచించింది. రాజస్థాన్‌లోని జైసల్మేర్ నగరంలో గురువారం రాత్రి అలముకున్న చీకట్లు కార్యదర్శులతో ప్రధాని సమావేశం ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అన్ని మంత్రిత్వశాఖలు, విభాగాల కార్యదర్శులతో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో సివిల్ డిఫెన్స్ మెకానిజాన్ని బలోపేతం చేయడం, తప్పుడు వార్తలను ఎదుర్కోవడం, కీలక మౌలిక సదుపాయాల భద్రత గురించి చర్చించారు. నిరంతర అప్రమత్తత, స్పష్టమైన కమ్యూనికేషన్ ఉండాలని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ భేటీ అయ్యారు. సరిహద్దు గ్రామాల్లోని ప్రజల భద్రతపై వీరు చర్చించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే అంశం గురించి మాట్లాడుకున్నారు. భారత్‌లోకి చొరబాటుకు యత్నించిన పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని సరిహద్దు భద్రతా దళానికి చెందిన జవాన్లు హతమార్చారు. బుధవారం అర్ధరాత్రి పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌లో ఈ ఘటన జరిగింది. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్లున్న పాక్ సరిహద్దును మూసివేశారు. ఎవరైనా సరిహద్దులవద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే.. కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. పంజాబ్ ప్రభుత్వమూ కీలక చర్యలు తీసుకుంది. సరిహద్దుల్లోని 6 జిల్లాల్లో పాఠశాలలను మూసివేసింది. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరగడంపై ఐక్య రాజ్య సమితి సాధారణ సభ ఆందోళన వ్యక్తం చేసింది. శ్రీనగర్‌లో గురువారం రాత్రి విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో చీకటిమయమైన రహదారిపాక్ చేతుల్లోనే..ఉద్రిక్తతల తగ్గింపు అంశం పాకిస్థాన్ చేతుల్లోనే ఉందని విదేశీ వ్యవహారాలశాఖ కార్యదర్శి విక్రం మిస్రీ స్పష్టం చేశారు. పహల్గాం దాడి ద్వారా పాకిస్థానే ఉద్రిక్తతలను రెచ్చగొట్టిందని ఆయన పేర్కొన్నారు. 'మా లక్ష్యం ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం కాదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పహల్గాం ఉగ్ర దాడులకు ప్రతీకారం తీర్చుకున్నాం. పాకిస్థానే రెచ్చగొట్టింది. మేం స్పందించాం. ఇప్పుడూ బంతి పాకిస్థాన్ కోర్టులోనే ఉంది' అని మిస్రీ పేర్కొన్నారు. 'అంతర్జాతీయ సమాజానికి దాయాది దేశం తప్పుడు సమాచారం అందిస్తోంది. పహల్గాం దాడులకు తామే బాధ్యులమని టీఆర్ఎఫ్ రెండు సార్లు ప్రకటించుకుంది. మరోవైపు.. తమ దేశంలో ఉగ్రవాదులు లేరని పాక్ చెబుతోంది. టీఆర్ఎఫ్ అనేది లష్కరే తయ్యిబా ముసుగు సంస్థ అని ఎన్నోసార్లు చెప్పాం. ఐరాసలో పహల్గాం ఉగ్రదాడి చర్చల్లో టీఆర్ఎఫ్ పాత్రను పాక్ వ్యతిరేకించింది. తగిన ఆధారాలను ఐరాసకు ఇప్పటికే అందించాం. ఐరాస నిషేధించిన ఉగ్రవాదులకు పాకిస్థాన్ నిలయంగా ఉంది. ఉగ్రవాదాన్ని వదులుకునేందుకు పాక్ ఇప్పటికీ సిద్ధంగా లేదు. ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయడం పాక్‌లో ఆచారం. ఆపరేషన్ సిందూర్‌లో సామాన్య పౌరులు చనిపోయారనేది అవాస్తవం. ప్రార్థనా స్థలాలపై దాడి చేశామనేది కూడా అబద్ధమే. సిక్కులను లక్ష్యంగా చేసుకుని కశ్మీర్‌లోని గురుద్వారాలపై పాక్ దాడులు చేస్తోంది. తాజా దాడుల్లో ముగ్గురు సిక్కులు చనిపోయారు' అని మిస్రీ వివరించారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లా మఖాన్ విండి గ్రామంలో పడిన రాకెట్ శకలాన్ని పరిశీలిస్తున్న భద్రతా సిబ్బందిసరిహద్దుల్లో ఉద్రిక్తత ఆపరేషన్ సిందూర్‌తో దిక్కుతోచని పాకిస్థాన్.. సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. కుప్వారా, బారాముల్లా, ఉరీ, పూంఛ్, మెంధార్, రాజౌరీ సెక్టార్లలో మోర్టార్లు, శక్తిమంతమైన శతఘ్నులతో కాల్పులకు తెగబడింది. దీంతో బుధ, గురువారాల్లో 16 మంది మరణించారు. ఇందులో ఐదుగురు చిన్నారులు, ముగ్గురు మహిళలున్నారు. పూంఛ్ సెక్టార్‌లో చనిపోయిన వారిలో లాన్స్‌నాయక్ దినేశ్ కుమార్ (32) ఉన్నారు. ఆయన హరియాణాకు చెందినవారు. మరోవైపు పాక్ కవ్వింపులను భారత్ సమర్థంగా తిప్పికొడుతోంది. దొరికిన పాక్ పైలట్ దేశంలోని పలు రాష్ట్రాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ఆలయాలు, నీటి ప్రాజెక్టుల వద్ద భద్రత పెంచారు. విమానాశ్రయాల్లో సందర్శకులకు అనుమతి రద్దు చేశారు. దిల్లీలోని ముఖ్యమైన ప్రదేశాల్లో జన సంచారాన్ని నిషేధించారు. పాకిస్థాన్‌కు చెందిన ఒక ఎఫ్16, రెండు జేఎఫ్17 యుద్ధ విమానాలను భారత సైన్యం కూల్చేసింది. ఒక పైలట్ మన సైన్యానికి చిక్కాడు. అఖ్నూర్‌లో ఎస్400 రక్షణ వ్యవస్థ ఆ విమానాన్ని కూల్చేసింది. పాక్ పంజాబ్ ప్రావిన్సులోని గగనతల ముందస్తు హెచ్చరిక వ్యవస్థ (అవాక్స్)ను భారత్ ధ్వంసం చేసింది.జమ్మూ కశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ఆయా రాష్ట్రాల్లోని ఆలయాలు, నీటి ప్రాజెక్టుల వద్ద భద్రత పెంచారు. విమానాశ్రయాల్లో సందర్శకులను అనుమతించవద్దని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దిల్లీలో 90 విమాన సర్వీసులను రద్దు చేసినట్లు సమాచారం. రద్దైన విమానాల్లో 5 అంతర్జాతీయ విమానాలు ఉన్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పటికే 27 విమానాశ్రయాలను మూసివేశారు.

మొదటి పేజీ తరువాయి

# తొలిసారిగా ఎస్-400 ప్రయోగం!

ఈ కబురు: జమ్మూకశ్మీర్ సహా పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పాకిస్థాన్ దాడులకు తెగబడింది. జమ్మూ ఎయిర్ పోర్టుతోపాటు జైసల్మేర్ విమానాశ్రయం లక్ష్యంగా దాడులకు యత్నించినట్లు తెలుస్తోంది. వీటిని దీటుగా ఎదుర్కొంటున్న భారత సైన్యం.. దాయాది డ్రోన్లను ఎప్పటికప్పుడు నిర్వీర్యం చేస్తోంది. అంతకుముందు పాకిస్థాన్‌కు చెందిన ఓ ఎఫ్16 యుద్ధ విమానాన్ని భారత రక్షణ వ్యవస్థ కూల్చివేసినట్లు తెలుస్తోంది. వీటితోపాటు రెండు జేఎఫ్17 యుద్ధ విమానాలను సైతం దెబ్బతీసినట్లు సమాచారం. పాకిస్థాన్ వాయుసేనకు చెందిన ఎఫ్16 సూపర్‌సోనిక్ విమానం అక్కడి సర్గోధ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి టేకాఫ్ అయ్యింది. అదే సమయంలో భారత్‌కు చెందిన ఎస్ఏఎం రక్షణ వ్యవస్థ.. ఆ యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు తెలిసింది. అయితే, దీనిపై అధికారంగా ఎటువంటి సమాచారం లేదు. గగనతల రక్షణ వ్యవస్థలు అప్రమత్తం.. మ్మూతోపాటు పంజాబ్, రాజస్థాన్‌లలో పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు ఉధృతం చేస్తున్న వేళ భారత సైన్యం కూడా వివిధ గగనతల రక్షణ వ్యవస్థలను రంగంలోకి దించింది. ఎస్400 సుదర్శన చక్ర, ఎల్70, జెడ్ఎస్‌యూ23తోపాటు షిల్కా గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైనిక స్థావరాలను టార్గెట్ చేసిన పాకిస్తాన్.. ఒకేసారి 15 నగరాల్లోని ఆర్మీ బేస్‌లపై దాడిచేసింది. ఈ దాడిని భారత్ తన 'సుదర్శన చక్రం'తో తిప్పికొట్టింది. రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్400 రక్షణ వ్యవస్థే ఈ 'సుదర్శన చక్ర'. భారత రక్షణ వ్యవస్థలో ఇది ఒక గేమ్ ఛేంజర్. 15 నగరాలపై జరిగిన దాడులను తిప్పికొట్టిందంటే.. ఈ వ్యవస్థ ఎంత శక్తిమంతమైనదో అర్థం చేసుకోవచ్చు. 400 కిలోమీటర్ల దూరంలో ఉండే టార్గెట్ల నుంచి 40 కిలోమీటర్ల దగ్గరలోకి వచ్చేసిన టార్గెట్లను కూడా 'సుదర్శన చక్ర' బూడిద చెయ్యగలదు.ట్రైలర్‌తోనే మెప్పించింది.. గతేడాది ఈ ఎస్400 ఎయిర్ డిఫెన్స్ మిసైల్ వ్యవస్థ.. భారత వాయుసేనలో చేరింది. ఈ సందర్భంగా చేపట్టిన వాయసేన విన్యాసాల్లో 80 శాతం టార్గెట్లను 'సుదర్శన చక్ర' ధ్వంసం చేసింది. మిగతా 20 శాతం టార్గెట్లను వెనక్కు తిరిగి పారిపోయేలా చేసింది. ఈ ఎక్సర్‌సైజు తర్వాతనే ఎయిర్ ఫోర్సులోకి 'సుదర్శన చక్ర'ను ప్రవేశపెట్టారు.

### యూఎస్‌ను కాదని 35 వేల కోట్ల డీల్..

'సుదర్శన చక్ర' అసలు పేరు ఎస్400 ట్రయంఫ్. రష్యాలో తయారు చేసిన ఈ రక్షణ వ్యవస్థను కొనుగోలు చేయాలని 2018లోనే భారత్ నిర్ణయించుకుంది. దీనికోసం రూ.35 వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఇది అమెరికాకు నచ్చలేదు. ముఖ్యంగా రష్యాఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత.. ఈ ఒప్పందం రద్దు చేసుకోవాలని భారత్‌పై తెగ ఒత్తిడి చేసింది యూఎస్. లేదంటే ఆంక్షలు విధిస్తామని బెదిరించింది. అయినా సరే భారత్ తలొగ్గలేదు.


### ఇంకా కంప్లీట్ కాలేదు..

రష్యాఉక్రెయిన్ యుద్ధం వల్ల ఎస్400 రక్షణ వ్యవస్థ మనకు ఇంకా పూర్తిస్థాయిలో దక్కలేదనే చెప్పాలి. మొత్తం ఐదు స్క్వాడ్రన్‌ల కోసం భారత్‌రష్యా మధ్య ఒప్పందం జరిగింది. కానీ ఇప్పటి వరకు కేవలం 3 స్క్వాడ్రన్‌లు మాత్రమే భారత్‌కు వచ్చాయి. వచ్చే ఏడాది ఆగస్టులోగా మిగిలిన రెండు స్క్వాడ్రన్‌లను అందజేస్తామని రష్యా హామీ ఇచ్చింది. వీటిని వాయుసేనకు అందజేసే సమయంలోనే విష్ణుమూర్తి చేతిలో ఉండే 'సుదర్శన చక్రం' పేరు మీదుగా 'సుదర్శన చక్ర' అనే పేరు పెట్టడం జరిగింది.



మొదటి పేజీ తరువాయి

## మా సహనాన్ని పరీక్షించొద్దు పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ వార్నింగ్



భారత్ సహనాన్ని అలుసుగా తీసుకుంటే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. 'నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్'లో మాట్లాడుతూ దేశభద్రతకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టంచేశారు. "మేం ఎల్లప్పుడూ సంయమనంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాం. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడాన్ని విశ్వసిస్తాం. దీనర్థం ఎవరైనా మా ఓపికను దుర్వినియోగం చేయవచ్చని కాదు. మా సహనాన్ని అవకాశంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే.. ఆపరేషన్ సిందూర్ మాదిరిగా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి" అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.సైన్యంపై ప్రశంసలు.. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను ఊహించని కచ్చితత్వంతో అమలు చేశాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాయని, ఇందులో అనేకమంది ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సాయుధ బలగాలు ధైర్యసాహసాలు ప్రదర్శించాయని ప్రశంసించారు. సామాన్యులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఈ ఆపరేషన్ చేపట్టామని, అత్యాధునిక పరికరాలు, సుశిక్షితులైన సాయుధ దళాల పనితీరువల్లే ఇది సాధ్యమైందన్నారు.

మొదటి పేజీ తరువాయి

## అఖిలపక్ష భేటీ.. మోదీ సందేశం వినిపించిన రాజ్‌నాథ్ సింగ్



**ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నేడు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష భేటీ నిర్వహించింది.**

ఈ కబురు: పహల్గాం ఉగ్రదాడికి 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత్ గట్టిగా బదులిచ్చిన సంగతి తెలిసిందే. మన భద్రతా బలగాలు మంగళవారం అర్ధరాత్రి దాటాక అత్యంత కచ్చితత్వంతో ఉగ్ర స్థావరాలపై దాడి చేయడంతో దేశమంతా హర్షం వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో ఆపరేషన్ గురించి వివరించేందుకు ప్రభుత్వం తాజాగా అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. దేశమంతా ఐక్యంగా నిలబడాలంటూ ప్రధాని మోదీ ఇచ్చిన సందేశాన్ని వినిపించింది. ఈ భేటీకి ముందు ప్రధాని మోదీ నివాసానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ వచ్చారు. ప్రస్తుత భద్రతా పరిస్థితులను ప్రధానికి వెల్లడించారు.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత అఖిలపక్ష భేటీ జరగడం ఇది రెండోసారి. పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన ఈ భేటీకి కేంద్రం తరఫున మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్. జైశంకర్, జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. విపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సందీప్ బందోపాధ్యాయ్, టీఆర్ బాలు తదితరులు పాల్గొన్నారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ సందేశాన్ని వినిపించారు.

మంగళవారం రాత్రి అందరూ నిద్రపోతున్న వేళ.. క్షిపణులు, డ్రోన్లతో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో విరుచుకుపడింది. మన సరిహద్దులకు ఆవల 100 కిలోమీటర్ల దూరం వరకూ వెళ్లి 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. 80 మంది ఉగ్రవాదులను హతమార్చి పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకుంది. ఇంత భారీ స్థాయిలో దాడులు చేసినా తన బాధ్యతను భారత్ మరిచిపోలేదు. ఎక్కడా పాక్ సైనిక స్థావరాలపైగానీ, పౌరుల నివాసాలపైగానీ దాడి చేయలేదు. ఉద్రిక్తతలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడలేదు. ప్రపంచానికి ముప్పుగా ఉన్న ఉగ్రవాద మూలాలను పెకిలించడానికే ప్రాధాన్యమిచ్చింది.

# జోనల్ కమిషనర్ తో సమావేశమైన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



జోనల్ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న గంగాధర్ రెడ్డి



కమిషనర్ తో సమావేశమైన కార్పొరేటర్

### గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధిపై చర్చ

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ హేమంత్ భోర్కడేను శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ గా నూతనంగా భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పుల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జోనల్ కమిషనర్ తో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అసంపూర్ణంగా ఉన్న పనులను తక్షణమే పునఃప్రారంభించి పూర్తిచేసే విదంగా అధికారులను ఆదేశించాలని కమిషనర్ హేమంత్ ను కోరారు. ముఖ్యంగా చెరువుల అభివృద్ధి, పార్కుల నిర్వహణ, రోడ్ల మరమ్మతులు వంటి అంశాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు మెరుగుపరచడంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఐటీ సెక్టార్ కేంద్రంగా ఉన్న గచ్చిబౌలి డివిజన్ లో జనాభా రోజురోజుకు పెరుగుతుందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపర్చావలసిన అవసరం ఉందన్నారు.

# ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్యం : రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ మిశ్రా



జోనల్ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న గంగాధర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని నల్లగండ్లలో నూతన ఇందు ఆయుర్వేద హాస్పిటల్ ను ప్రారంభించారు. గురువారం నిర్వహించిన కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్ మిశ్రా మాట్లాడుతూ ఆయుర్వేదం మన సంప్రదాయ చికిత్స అని, ఆయుర్వేద మందుల ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని అన్నారు. మన ప్రాచీన వైద్య చికిత్సలో ఎంతో ప్రసిద్ధిగాంచిన ఆయుర్వేద హాస్పిటల్ ను అందరికీ అందుబాటులో ఉండేలా నల్లగండ్లలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆయుర్వేదం మన సంప్రదాయ చికిత్స, దీని ద్వారా ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. తాను ఎంతోకాలంగా ఆయుర్వేద చికిత్స విధానాలను అనుసరిస్తున్నానని, 35 ఏళ్ల పాటు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వానికి సేవలందించానన్నారు. మానసిక, శారీరక రుగ్మతలతో పాటు దీర్ఘకాలిక రోగాలకు సైతం మెరుగైన వైద్య చికిత్సలో ఆయుర్వేదంలో చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వైద్యులు ప్రదీప్ నోరి అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ పవన్ మల్లాడి, డాక్టర్ వంశీధర్ అల్లం, డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్రిక్తతలకు తెరలేపింది పాకిస్థానే - 'ఆపరేషన్ సిందూర్'పై భారత్

ఉగ్రవాదులకు అధికారికంగా అంత్యక్రియలు..

''ఉగ్రవాదానికి పాకిస్థాన్ కేంద్రంగా ఉందనే విషయం ఇప్పటికే ఎన్నోసార్లు రుజువైంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంతో భారత్ తీవ్రంగా నష్టపోయింది. ముంబయి, ఉరి, పుల్వామా, పఠాన్‌కోట్ దాడులు కొన్ని ఉదాహరణలు. ఉగ్రదాడుల్లో పాక్ ప్రమేయం ఉందన్న ఆధారాలను ఎన్నోసార్లు బయటపెట్టాం. ఎన్ని ఆధారాలు చూపినా.. పాక్ పట్టించుకోలేదు. ఉగ్రవాద వ్యతిరేక దర్యాప్తులను నిలిపివేసింది. ఒసామా బిన్ లాడెన్‌ను అమరవీరుడని ఎవరు కొనియాడారో చెప్పక్కర్లేదు. ఐరాస నిషేధించిన ఉగ్రవాదులకు పాకిస్థాన్ నిలయంగా ఉంది. ఉగ్రవాదాన్ని వదులుకునేందుకు పాక్ ఇప్పటికీ సిద్ధంగా లేదు. ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయడం పాక్‌లో ఆచారం'' అని విదేశాంగశాఖ కార్యదర్శి వెల్లడించారు. ''ఆపరేషన్ సిందూర్'లో సామాన్య పౌరులు చనిపోయారనేది అవాస్తవం. ప్రార్థనా స్థలాలపై దాడి చేశామనేది కూడా అబద్ధమే. పాకిస్థాన్ స్థానికంగా కొన్ని ప్రార్థనా స్థలాలను దుర్వినియోగం చేస్తూ ఉగ్రస్థావరాలుగా చేసుకున్న మాట వాస్తవమే. పైగా.. సిక్కులను లక్ష్యంగా చేసుకొని కశ్మీర్‌లోని గురుద్వారాలపై దాడులు చేస్తోంది. తాజా దాడుల్లో ముగ్గురు సిక్కులు చనిపోయారు. సామాన్య పౌరులపై ఆ దేశం దాడులు చేస్తోంది. ఇప్పటివరకు 16 మంది చనిపోయారు. ఉగ్రవాద నిర్మూలనకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు పాకిస్థాన్ మతం రంగు పులుముతోంది. దాయాది దాడులను భారత్ ప్రజలు మతాలకు అతీతంగా ఖండిస్తున్నారు. సామాన్యులపై దాడులు చేస్తూ పాకిస్థాన్ ఉద్రిక్తతలను తీవ్రతరం చేస్తోంది'' అని విక్రమ్ మిస్రీ తెలిపారు. ''సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘిస్తోందని పాక్ దుష్ప్రచారం చేస్తోంది. 60 ఏళ్లుగా ఆ ఒప్పందాన్ని గౌరవించాం. స్నేహంలో భాగంగానే అది అమలవుతుందని ఆనాటి ఒప్పందంలో ఉంది. సీమాంతర ఉగ్రవాదాన్ని పాక్ ప్రోత్సహిస్తున్నందుకే దాని అమలును నిలిపేశాం. పాకిస్థాన్ ప్రస్థానమే అబద్ధాలతో మొదలైంది. అసత్యాలు పలకడం పాక్‌కు అలవాటే. అది మాకు ఆశ్చర్యం కలిగించలేదు. నీలంజీలం ప్రాజెక్టును భారత్ లక్ష్యంగా చేసుకుందని పాక్ తప్పుడు ప్రచారం చేస్తోంది. సైనిక స్థావరాలు లక్ష్యంగా చేసుకోలేదు. కేవలం ఉగ్రస్థావరాలే భారత్ లక్ష్యమని చెప్పాం. అసత్య ప్రచారాల పర్యవసానాలకు పాకిస్థాన్‌దే బాధ్యత'' అని విదేశాంగశాఖ వెల్లడించింది. దీటుగా బదులిస్తాం.. ''ఆపరేషన్ సిందూర్' అనేది పాకిస్థాన్ దుశ్చర్యకు సమాధానం మాత్రమే. పౌరులను కాపాడుకునే భారత హక్కును ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయి. పహల్గాం దాడిపై బదులిచ్చే హక్కు భారత్‌కు ఉందని ప్రపంచదేశాలు గుర్తిస్తున్నాయి. పహల్గాం ఘటనపై పాక్ సంయుక్త విచారణ కోరుతోంది. అలా కోరే అర్హత ఆ దేశానికి లేదు. ముంబయి దాడులు, పఠాన్‌కోట్ ఘటనల్లో నేర విచారణకు పాక్ సహకరించలేదు. ఎన్ని ఆధారాలు చూపించినా విచారణను ముందుకు సాగనివ్వలేదు. పాక్ ఎలాంటి చర్యలు తీసుకున్నా.. దీటుగానే భారత్ బదులిస్తుంది'' అని విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు.



# భారత్ వైపు కన్నెత్తి చూస్తే.. భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే: సీఎం రేవంత్ హెచ్చరిక





ఈ కబురు,హైదరాబాద్: ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత సార్వభౌమత్వం మీద దాడి చేయాలని చూసేవారికి ఈ భూమ్మీద నూకలు చెల్లినట్లేనని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా హైదరాబాద్‌లో చేపట్టిన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉగ్రమూకలకు ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ''పాక్ ఉగ్రవాదులు, పాక్ పాలకులు, అంతర్జాతీయ ముఖచిత్రంలో ఉన్న ఏ దేశమైనా సరే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత సార్వభౌమత్వంపై దాడి చేయాలనుకొని.. భారత్ వైపు కన్నెత్తి చూస్తే ఈ భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే. భూమ్మీద మీరు నివసించేందుకు అర్హత కోల్పోయినట్లే. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు ఉండొచ్చు. భిన్న సిద్ధాంతాలు ఉండొచ్చు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ఉగ్రవాదుల పీచమణిచేందుకు ఏ చర్య తీసుకున్నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇదీ భారతీయుల స్ఫూర్తి'' అన్నారు.

ఆపరేషన్ సిందూరే మీకు సమాధానం..

''బ్రిటిష్ వాళ్ల నుంచి శాంతి ద్వారానే భారత్‌తో పాటు పాక్‌కు కూడా స్వేచ్ఛా వాయువులు అందించి అమరుడయ్యారు మహాత్ముడు. ఆయన ఇచ్చిన చేసిన శాంతియుత పోరాటం వల్లే మనం ఈరోజు స్వేచ్ఛను అనుభవిస్తున్నాం. ఆయన శాంతి సిద్ధాంతాన్ని పుణికి పుచ్చుకున్న భారతీయులు శాంతిని కోరుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే దిశగా కొనసాగుతున్నారు. మా శాంతి ఆకాంక్షను చేతగానితనంగా భావించి ఎవరైనా మా భూభాగంలో కాలుమోపి.. మా ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచేయాలని అనుకుంటే.. ఆపరేషన్ సిందూరే మీకు సమాధానం. ఆపరేషన్ సిందూర్ ద్వారానే మిమ్మల్ని నేలమట్టం చేసే శక్తి మా వీర జవాన్లకు ఉంది. ఆ వీర జవాన్‌లకు 140 కోట్ల భారతీయులు అండగా నిలబడతారని ఈ ర్యాలీ ద్వారా సందేశం ఇవ్వదలచుకున్నాం'' అన్నారు.

సైన్యానికి సంఘీభావంగా హైదరాబాద్‌లో భారీ ర్యాలీ

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ఈ ర్యాలీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కొనసాగింది. జాతీయ జెండాలను చేతబూని ర్యాలీగా ముందుకు సాగారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఈ ర్యాలీలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ విజయశాంతి, సచివాలయ ఉద్యోగులు, మాజీ సైనికాధికారులు, భారీ సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు.

# ఆపరేషన్ సిందూర్...

## దేశ ఐక్యతకు నిదర్శనం : రవీందర్ యాదవ్



రవీందర్ యాదవ్

### ఉగ్రస్థావరాలపై భారత్ దాడి శుభపరిణామం

ఈకబురు, శేరిలింగంపల్లి : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు ఆనందంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్ అన్నారు. దశాబ్దాలుగా సహనం.. సహనం.. మితిమీరిన సహనంతో చేతులు కట్టేసిన సమస్త భారత్‌కు, ఆపరేషన్ సింధూర్‌తో తిరిగి భారత సమాజంలో వీరత్వాన్ని నింపిన త్రివిధ దళాధిపతులకు, మన దళాలకు వెన్నంటి నిలబడ్డ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా మీ వెన్నంటే మేము ఉంటామని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. పెహల్గామ్ లో పాక్ చేసిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ ఆపరేషన్ సిందూర్ తో గట్టి జవాబును ఇచ్చిందన్నారు. మరిన్ని ఉగ్రస్థావరాలను సైతం పాక్ లో లేకుండా భారత్ చేయాలని కేంద్రాన్ని కోరారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తుందని ఆరోపించారు. పుల్వామా, ఉరి ఘటనలు మరిచిపోలేనివన్నారు. పర్యాటకులను టార్గెట్ చేసి పెహల్గామ్ లో ఉగ్రవాదులు దాడులు చేయడం జరిగిందన్నారు. పాక్ లోని ఉగ్రవాదులను ఏరిపారేయాలని కేంద్రాన్ని కోరారు. ఆపరేషన్ సిందూర్ తో ఆగిపోవద్దన్నారు. దేశంలోనూ ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# విద్యుత్ సరఫరా నిలిపివేత.. సరిహద్దు రాష్ట్రాల్లో 'హై అలర్ట్'!



**భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్న వేళ.. సరిహద్దు రాష్ట్రాల్లోని జిల్లాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పాఠశాలలు మూసివేయడంతోపాటు పోలీసు సిబ్బంది, ఇతర అధికారులకు సెలవులను రద్దు చేశారు.**

ఈ కబురు: భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్న వేళ అనేక రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. సరిహద్దు జిల్లాల్లో ఇప్పటికే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యాసంస్థలు మూసివేశారు. పోలీసు సిబ్బంది, ఇతర అధికారుల సెలవులను రద్దు చేశారు. ముఖ్యంగా జమ్మూకశ్మీర్‌తో సహా పంజాబ్, హరియాణా, రాజస్థాన్, దిల్లీ, గుజరాత్, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాలు చర్యలకు ఉపక్రమించాయి.

పంజాబ్ ప్రభుత్వం అక్కడి పోలీసు సిబ్బందికి సెలవులు రద్దు చేసింది. సరిహద్దులోని ఆరు జిల్లాల పరిధిలో స్కూళ్లు మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఫెరోజ్‌పుర్, పఠాన్‌కోట్, ఫజిల్కా, అమృత్‌సర్, గురుదాస్‌పుర్, తర్న్ తరన్ జిల్లాల్లో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అన్ని పాఠశాలలు మూసివేయనున్నట్లు తెలిపింది. దీంతో పాటు చండీగఢ్ సహా అనేక జిల్లాల్లో కరెంటు నిలిపివేశారు. ఉద్రిక్తతల వేళ అప్రమత్తంగా ఉన్నామని పంజాబ్ మంత్రి అమన్ అరోరా వెల్లడించారు.
హరియాణాలోనూ పోలీసు సిబ్బంది సహా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగులకు సెలవులు రద్దు చేశారు. వారు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఉండాలని అన్ని జిల్లాల సివిల్ సర్జన్లకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా కేంద్రాన్ని వీడి వెళ్లవద్దని స్పష్టం చేశారు.
దిల్లీ ప్రభుత్వం కూడా ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అత్యవసర పరిస్థితులు నెలకొనే అవకాశమున్న వేళ.. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఏ అధికారికీ సెలవులు ఇవ్వద్దని స్పష్టం చేసింది. ఎమర్జెన్సీ పరిస్థితులు ఏర్పడితే సంసిద్ధత కోసం ఆయా విభాగాల అధికారులతో సమీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.
పంజాబ్ సరిహద్దు కలిగిన హిమాచల్ ప్రదేశ్‌లోనూ హై అలర్ట్ ప్రకటించారు. హమీర్‌పుర్, ఉనా, బిలాస్‌పుర్ సహా సరిహద్దు జిల్లాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. బాబా బాలక్‌నాథ్, మాతా చింత్‌పుర్నీ, మాతా నైనా దేవీ వంటి ప్రముఖ ఆలాయాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు.
రాజస్థాన్ ప్రభుత్వం కూడా పోలీసుల, ఇతర శాఖల ఉద్యోగుల సెలవులను రద్దు చేసింది. ఐదు సరిహద్దు జిల్లాల్లోని స్కూళ్లను కూడా మూసివేసింది. పశ్చిమ రాజస్థాన్‌లోని సరిహద్దు జిల్లాల్లో కరెంటు సరఫరా నిలిపివేసింది. బార్మర్, జైసల్మేర్, జోధ్‌పుర్ సహా పలు జిల్లాల్లో రాత్రి 9 నుంచి ఉదయం వరకు బ్లాక్‌అవుట్ అమలు చేస్తున్నారు. ప్రజలు ఇళ్లలో లైట్లను ఆపేయాలని గంగానగర్ పోలీసులు సూచించారు. మే 10వ తేదీ వరకు బికనెర్, అజ్మీర్‌లోని కిషన్‌గఢ్, జోధ్‌పుర్ ఎయిర్‌పోర్టుల్లో విమాన సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.
గుజరాత్ తీర ప్రాంతంలోనూ భద్రత కట్టుదిట్టం చేశారు. పోలీసు సిబ్బంది సెలవులు రద్దు చేయడంతోపాటు.. సెలవుల్లో ఉన్నవారిని తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశించారు. గుజరాత్‌కు భూ, సముద్ర సరిహద్దు ఉంది. రాజ్‌కోట్ రేంజ్, జామ్‌నగర్, మోర్బీ, దేవ్‌భూమి, ద్వారక జిల్లాలకు తీర ప్రాంతం ఉంది. గ్రామాల్లో పోలీసు గస్తీ పెంచిన అధికారులు.. ఏమైనా అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే తెలియజేయాలని గ్రామప్రజలు, సర్పంచ్‌లకు సూచించారు.
పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే సెలవులో ఉన్నవారు వెంటనే తిరిగి విధుల్లో చేరాలని ఆదేశించింది. బిహార్ ప్రభుత్వం కూడా ఇదే తరహా చర్యలు తీసుకుంది.



# బ్రిటన్ వజ్రాలపై సుంకం కోత లేదు

**బ్రిటన్ నుంచి మనదేశంలోకి దిగుమతి అయ్యే పలు పారిశ్రామిక వస్తువులకు సుంకం మినహాయింపులు ఇవ్వడం లేదని ఒక ఉన్నతాధికారి తెలిపారు. ఈ జాబితాలో వజ్రాలు, వెండి, స్మార్ట్‌ఫోన్లు, ఆప్టికల్ ఫైబర్స్ (ఓఎఫ్‌సీ) వంటివి ఉన్నాయి.**

**వెండి, స్మార్ట్‌ఫోన్లు, ఓఎఫ్‌సీలకూ**

**దిల్లీ:** బ్రిటన్ నుంచి మనదేశంలోకి దిగుమతి అయ్యే పలు పారిశ్రామిక వస్తువులకు సుంకం మినహాయింపులు ఇవ్వడం లేదని ఒక ఉన్నతాధికారి తెలిపారు. ఈ జాబితాలో వజ్రాలు, వెండి, స్మార్ట్‌ఫోన్లు, ఆప్టికల్ ఫైబర్స్ (ఓఎఫ్‌సీ) వంటివి ఉన్నాయి. బ్రిటన్‌తో తాజాగా కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) పరిధిలోకి ఇవి రాలేదని ఆ అధికారి స్పష్టం చేశారు.

బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే పెట్రోలు, డీజిల్ ఇంజిన్ వాహనాలపై ముందుగా నిర్ణయించిన కోటా ఆధారంగానే సుంకం మినహాయింపులు ఉంటాయి. బెంట్లీ, బీఎండబ్ల్యూ, రోల్స్ రాయిస్, ఆస్టన్ మార్టిన్ వంటి ఖరీదైన, విలాసవంత బ్రాండ్ల కార్లన్నీ బ్రిటన్‌కు చెందినవే. బ్రిటన్ విద్యుత్ వాహనాల (ఈవీ) దిగుమతి కోటాకు సంబంధించి 'కొన్ని వేల' వాహనాల వరకే కస్టమ్స్ సుంకం తగ్గింపు రేటు వర్తిస్తుంది. సునిశిత పారిశ్రామిక వస్తువులైన ప్లాస్టిక్స్, వజ్రాలు, వెండి, స్మార్ట్‌ఫోన్లు, టీవీ కెమేరా ట్యూబులు, ఆప్టికల్ ఫైబర్స్, ఆప్టికల్ ఫైబర్స్ బండిళ్లుకేబుళ్లు ఎఫ్‌టీఏ పరిధిలోకి రావు. కాబట్టి దిగుమతి సుంకం ప్రయోజనాలు వీటికి వర్తించవు. అయితే బ్రిటన్ కంపెనీలు విస్కీ, కార్లు, ఇతర ఉత్పత్తులను సులభతరంగా భారత్‌కు ఎగుమతి చేసేందుకు ఈ ఒప్పందం వల్ల వీలవుతుంది. 2030 కల్లా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెండింతలు చేసి 120 బిలియన్ డాలర్లకు చేర్చాలన్నది ఎఫ్‌టీఏ లక్ష్యం. ప్రభుత్వ రంగ ప్రొక్యూర్‌మెంట్‌లో బ్రిటన్ కంపెనీలకు అనుమతి: ఎఫ్‌టీఏ కింద బ్రిటన్ కంపెనీలు, మన ప్రభుత్వ రంగ కంపెనీలకు చెందిన వస్తువులు, సేవల ప్రొక్యూర్‌మెంట్‌లో పాల్గొనవచ్చు. యూఏఈ తర్వాత బ్రిటన్‌కు భారత్ ఈ అవకాశాన్ని కల్పించింది. అయితే రాష్ట్ర, స్థానిక స్థాయి కంపెనీలు ఎఫ్‌టీఏ కిందకు రావు. కేంద్ర స్థాయి కంపెనీల్లోనూ సునిశితం కాని సంస్థలే దీని కిందకు వస్తాయి.






# ఫేస్‌బుక్ పేజీలు, ఖాతాల తొలగింపు

**భారత్, బ్రెజిల్ ప్రజలే లక్ష్యంగా ఆర్థిక మోసాలు చేసేందుకు ఉద్దేశించిన 23,000కు పైగా ఫేస్‌బుక్ పేజీలు, ఖాతాలను ఈ ఏడాది మార్చిలో తొలగించినట్లు మెటా బుధవారం వెల్లడించింది.**

**పెట్టుబడుల స్కామ్‌లతో సంబంధం వల్లే**

**దిల్లీ:** భారత్, బ్రెజిల్ ప్రజలే లక్ష్యంగా ఆర్థిక మోసాలు చేసేందుకు ఉద్దేశించిన 23,000కు పైగా ఫేస్‌బుక్ పేజీలు, ఖాతాలను ఈ ఏడాది మార్చిలో తొలగించినట్లు మెటా బుధవారం వెల్లడించింది. డీప్‌ఫేక్, ఇతరత్రా టెక్నిక్‌లను వాడి ప్రఖ్యాత వ్యక్తులు, ఆర్థిక కంటెంట్ క్రియేటర్లు, క్రికెటర్లు, వ్యాపారవేత్తల చిత్రాలతో నకిలీ వీడియోలు రూపొందించి, పలు పెట్టుబడుల యాప్‌లు, మోసపూరిత వెబ్‌సైట్ల గురించి ప్రచారం చేసుకోవడమే ఈ నేరగాళ్ల పద్ధతి. పెట్టుబడుల సలహాల పేరుతో మెసేజింగ్ యాప్‌లకు ప్రజలను/ఖాతాదార్లను రీడైరెక్ట్ చేస్తారు. కొన్ని సార్లు గూగుల్ ప్లే స్టోర్‌లాగే కనిపించే నకిలీ యాప్ స్టోర్ నుంచి మోసపూరిత యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకునేలా చూస్తారు. చెల్లింపులు పెట్టుబడుల మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, ఎలా రక్షించుకోవచ్చో మెటా సలహాలనిచ్చింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ వంటి తన సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫారాల్లో సేఫ్టీ టూల్స్ అందుబాటులో పెట్టినట్లు తెలిపింది. సాధారణంగా మోసపూరిత, కల్పిత సెక్యూరిటీలు/ఆస్తుల్లో డబ్బులు పెట్టాలంటూ ప్రజలను మోసపుచ్చుతుంటారు. సామాజిక ఖాతాలు, ఇమెయిల్స్, కాల్స్ ద్వారా క్రిప్టోకరెన్సీ, స్థిరాస్తి, షేర్లు వంటి వాటిల్లో పెట్టుబడులపై త్వరగా, సులభంగా పెద్ద మొత్తంలో ప్రతిఫలాలు వస్తాయని ఆశపెడతారు. తదుపరి ఆ మొత్తాలను ఉడ్చేస్తారు. ముందస్తు చెల్లింపుల స్కామ్‌లూ జరుగుతుంటాయి. ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్‌లో చట్టబద్ధ విక్రేతల్లా మోసపుచ్చి, వస్తువు డెలివరీకి ముందే డబ్బులు తీసుకుని మాయమవుతుంటారు. భారత అధికారులు, ప్రజలతో కలిసి డిజిటల్ భద్రతపై పనిచేయడం కొనసాగిస్తామని మెటా పేర్కొంది.

# దలాల్ స్ట్రీట్‌కు ఉద్రిక్తతల సెగ..

**అరగంటపాటు నిలిచిన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్**

**భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు దలాల్ స్ట్రీట్‌ను తాకాయి. దీంతో ఆఖరి అరగంటలో అమ్మకాలు వెల్లువెత్తాయి.**



భారత్ పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు దలాల్ స్ట్రీట్‌ను తాకాయి. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో నిర్వహించిన భారత సైనిక చర్యను జీర్ణించుకోలేని పాక్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు యత్నించింది. దీంతో ఆ దేశంలో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడుల్లో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు భారత రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ వార్తల నేపథ్యంలో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఉద్రిక్తతల నేపథ్యంలో చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 400 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,300 దిగువకు చేరింది. అంతర్జాతీయంగా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఉదయం 80,912.34 పాయింట్ల (క్రితం ముగింపు 80,746.78) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. తర్వాత స్వల్ప శ్రేణిలో లాభనష్టాల మధ్య చలించింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని సెన్సెక్స్ 411.97 పాయింట్ల నష్టంతో 80,334.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్ల నష్టంతో 24,273.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.72గా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.95 శాతం పతనం అవ్వగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.43 శాతం మేర క్షీణించింది.

సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, టాటా మోటార్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 61.95 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,348 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అరగంట పాటు నిలిచిన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్ భారత్ దెబ్బకు పాక్ స్టాక్ మార్కెట్ కుదేలవుతోంది. 'ఆపరేషన్ సిందూర్'తో నిన్న భారీగా పతనమైన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్.. నేడు అరగంట పాటు నిలిచిపోయింది. కరాచీ సమీపంలో భారత సైనిక బలగాలు విరుచుకుపడ్డాయన్న సమాచారంతో వ్యాపించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ట్రేడింగ్ నిలిపివేతకు ముందు కేఎస్ఈ 100 సూచీ దాదాపు 6,948 పాయింట్ల (6.32 శాతం) నష్టంతో 103,060 వద్ద నిలిచింది. కాసేపటికే ట్రేడింగ్ ప్రారంభమైనప్పటికీ నష్టాలు కొనసాగాయి.

# ADAS లెవల్ 2 ఫీచర్లతో కియా కరెన్స్ క్లావిస్..

## రేపటి నుంచి బుకింగ్స్ షురూ

**కియా సంస్థ కరెన్స్ క్లావిస్‌ను ఆవిష్కరించింది. మే 9 నుంచి బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్ భారత మార్కెట్‌లో జనాదరణ పొందిన తన ఎంపీవీ కరెన్స్‌ను మరింత అప్‌డేట్ చేసి కియా కరెన్స్ క్లావిస్ పేరుతో గురువారం ఆవిష్కరించింది. అధునాతన ఫీచర్లు, కొత్త హంగులు, మెరుగైన భద్రతా ఫీచర్లను జోడించింది. ధర వివరాలు మాత్రం వెల్లడించలేదు. మే 9 నుంచి బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి.**

కియా కరెన్స్ క్లావిస్ మూడు రకాల ఇంజిన్ ఆప్షన్లతో వస్తోంది. 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్, 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 1.5 లీటర్ డీజిల్ ఇంజిన్‌తో వస్తోంది. మొత్తం 7 ట్రిమ్స్‌లో లభిస్తుంది. ఐవరీ సిల్వర్ గ్లోస్, ప్యూటర్ ఆలివ్, ఇంపీరియల్ బ్లూ, గ్లేసియర్ వైట్ పెరల్, గ్రావిటీ గ్రే, స్పార్క్లింగ్ సిల్వర్, ఆరోరా బ్లాక్ పెరల్, క్లియర్ వైట్ రంగుల్లో లభిస్తుంది. **ఎక్స్‌టీరియర్:** క్లావిస్‌లో కియా సిగ్నేచర్ డిజిటల్ టైగర్ ఫేస్, ఐస్‌క్యూబ్ ఎంఎఫ్ఆర్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, స్టార్ మ్యాప్ ఎల్ఈడీ డేటైమ్ రన్నింగ్ లైట్లు ఉన్నాయి. పనోరమిక్ సన్‌రూఫ్, స్పోర్టీ అల్లాయ్ వీల్స్‌తో మరింత ఆకట్టుకునే లుక్‌తో అందుబాటులోకి వస్తోంది. ఇంటీరియర్: క్లావిస్‌లో ముందు సీట్లు వాక్‌ఇన్ స్లయిడింగ్ లివర్‌తో వస్తున్నాయి. ఇందులో 26.62 అంగుళాల డ్యూయల్ పనోరమిక్ డిస్‌ప్లే ప్యానెల్ ఉంది. ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, టచ్‌బేస్డ్ క్లైమేట్ కంట్రోల్ ప్యానెల్ వంటి ప్రీమియం ఫీచర్లు ఉన్నాయి. కరెన్స్ క్లావిస్‌లో 20కి పైగా భద్రతాపరమైన లెవెల్2 అడాస్ ఫీచర్లతో వస్తోంది. 6 ఎయిర్‌బ్యాగ్‌లు, 360డిగ్రీ కెమెరా, ఫార్వర్డ్ కొలిజన్ అవాయిడెన్స్ అసిస్ట్, లేన్ కీప్ అసిస్ట్, బ్లైండ్ స్పాట్ కొలిజన్ వార్నింగ్, అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్ వంటి అధునాతన ఫీచర్లను క్లావిస్‌కు జోడించారు. ఈ కారు ధరను జూన్ 2న వెల్లడించనున్నారు. అధికారిక వెబ్‌సైట్, డీలర్‌షిప్‌ల వద్ద రూ.25 వేలు బుకింగ్ మొత్తం చెల్లించి మే 9 నుంచి కారును రిజర్వ్ చేసుకోవచ్చు.







# గూగుల్‌లో మరోసారి లేఆఫ్‌లు..

## ఆ విభాగాల్లో ఉద్యోగాల కోత

**సేల్స్, పార్ట్‌నర్‌షిప్ విభాగాలను పర్యవేక్షించే గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్‌లో గూగుల్ లేఆఫ్‌లు ప్రకటించింది.**


కృత్రిమ మేధ అభివృద్ధిపై దృష్టిపెట్టిన టెక్ దిగ్గజం గూగుల్ మరోసారి కంపెనీలో పునర్వ్యవస్థీకరణ చర్యలు చేపట్టింది. ఈక్రమంలోనే మళ్లీ లేఆఫ్‌లు ప్రకటించింది. సేల్స్, పార్ట్‌నర్‌షిప్ విభాగాలను పర్యవేక్షించే తమ గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్‌లో 200 మంది ఉద్యోగులను తొలగించినట్లు తెలుస్తోంది. ఈమేరకు కంపెనీకి చెందిన విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ 'ది ఇన్ఫర్మేషన్' అనే మీడియా సంస్థ కథనం వెల్లడించింది.

కస్టమర్లకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు ఈ చిన్న చిన్న సర్దుబాట్లు తప్పడం లేదని లేఆఫ్‌ల గురించి గూగుల్ వెల్లడించినట్లు సదరు కథనం తెలిపింది. నెల రోజుల వ్యవధిలో ఈ సంస్థ ఉద్యోగులను తొలగించడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఏప్రిల్‌లోనే తమ ప్లాట్‌ఫామ్, డివైజ్ యూనిట్లలో పనిచేసే వందల మంది ఉద్యోగులను కంపెనీ తొలగించింది. ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్లలో పనిచేసే ఉద్యోగులపై ఈ వేటు పడింది.

కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా గత రెండేళ్లలో గూగుల్ అనేకమందిని విధుల నుంచి తప్పించింది. గతేడాది డిసెంబరులో మేనేజర్, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ హోదాల్లో పనిచేస్తున్న వారిలో 10 శాతం మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. ఇక, ఈ ఏడాది ఫిబ్రవరిలో హెచ్ఆర్ విభాగం, క్లౌడ్ ఆర్గనైజేషన్‌లో కొంతమందిని తొలగించింది. ఖర్చు తగ్గింపులో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది.

గూగుల్‌లో 20 శాతం మంది మరింత సమర్థంగా పని చేయాలని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ 2022లో వెల్లడించారు. ఆ మరుసటి ఏడాదే 12 వేల మంది ఉద్యోగులను గూగుల్ తొలగించింది. ఓపెన్‌ఏఐ వంటి సంస్థలు సెర్చ్ంజిన్‌ను తీసుకొస్తుండడంతో గూగుల్‌కు గట్టి పోటీ తప్పదని విశ్లేషకులు భావిస్తున్న వేళ ఈ తొలగింపులు చేపట్టడం గమనార్హం. ఇక, అమెరికాలో విదేశీ నిపుణులపై ట్రంప్ కఠిన నిబంధనలు అమలుచేస్తున్న సమయంలో ఈ లేఆఫ్ వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# మాతృత్వపు ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా దీపికా పదుకొణె



**ప్రెగ్నెన్సీ సమయంలో సవాళ్లు ఎదురైనట్లు దీపికా పదుకొణె చెప్పారు. బాలీవుడ్ నటి దీపికా పదుకొణె గతేడాది సెప్టెంబర్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాతృత్వపు ప్రయాణం గురించి పలు విషయాలు పంచుకున్నారు. నెలలు నిండేకొద్దీ ఎంతో కష్టంగా అనిపించినట్లు చెప్పారు.**

''మాతృత్వపు ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా. ముఖ్యంగా 8, 9 నెలల్లో చాలా కష్టంగా అనిపించింది. నా కుటుంబం, స్నేహితులు ఎప్పుడూ నాతోనే ఉండడం నేను చేసుకున్న అదృష్టంగా భావిస్తాను. నా బిడ్డకు పేరు పెట్టడం కోసం ఎంతో పరిశీలించాను. 'దువా' అని నిర్ణయించా. ఈ పేరుకు అర్థం ఏంటని చాలామంది అడుగుతుంటారు. 'దువా' అంటే ప్రార్థన అని అర్థం'' అని చెప్పారు. ఇక ఇటీవల కూడా దీపికా తల్లిగా తన కుమార్తెతో సమయం గడపడం, చిత్రీకరణలో పాల్గొనడం గురించి మాట్లాడారు. ''ఒక తల్లిగా చిత్రీకరణలో పాల్గొనడం అనేది ఎప్పుడూ సవాలే. ప్రస్తుతం నేను నా జీవితంలో మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇకపై షూటింగ్‌లలో పాల్గొనేందుకు సిద్ధమవ్వాలి. నా కుమార్తెకు తల్లిగా నా బాధ్యతలను నిర్వర్తిస్తూనే చిత్రీకరణల్లో పాల్గొనాలి'' అని చెప్పారు.

**ఎన్టీఆర్ 'రైతు' సినిమా.. కృష్ణవంశీ ఏమన్నారంటే!**

ప్రస్తుతం దీపికా కొత్త సినిమాలేవీ ప్రకటించలేదు. చివరిసారిగా 'సింగం అగైన్' లో శక్తిమంతమైన పాత్రలో ఆమె కనిపించారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్, కరీనాకపూర్‌ఖాన్, రణ్‌వీర్‌సింగ్, అక్షయ్‌కుమార్‌లు కీలక పాత్రలు పోషించారు. దీనితో పాటు గతేడాది 'కల్కి 2898 ఏడీ'లో సుమతి పాత్రలో కనిపించి సందడి చేశారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు జరుగుతున్నాయి.




# పాక్ ఓటీటీ కంటెంట్‌పై భారత ప్రభుత్వం కీలక నిర్ణయం



పాకిస్థాన్ మూలాలున్న ఓటీటీ కంటెంట్‌ను భారత్‌లో నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 'ఆపరేషన్ సిందూర్' ఇంకా కొనసాగుతోందని, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పాకిస్థాన్‌ను ముప్పేట దాడి చేసేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ భారత్ విడిచి పెట్టడం లేదు. ఇప్పుడు వినోద రంగం విషయంలోనూ భారత్ చర్యలకు ఉపక్రమించింది. వినోదం విషయంలో ఓటీటీలు విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయి. భాషా సరిహద్దులను సైతం చెరిపేశాయి. భారత్-పాక్ మధ్య ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పాక్ మూలాలున్న ఓటీటీ కంటెంట్‌ను పూర్తిగా నిలిపివేయాలని భారత సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఓటీటీ ప్లాట్‌ఫాంలకు సూచనలు జారీ చేస్తూ ప్రకటన విడుదల చేసింది.


'జాతీయ భద్రత దృష్ట్యా పాకిస్థాన్ మూలాలున్న ఓటీటీ కంటెంట్, ఓటీటీ వేదికలు, మీడియా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలు, మధ్యవర్తిత్వం ద్వారా అయ్యే ఏ ప్రసారమైనా ఇక పూర్తిగా నిలిపివేస్తున్నాం. పాకిస్థాన్ వెబ్‌సిరీస్‌లు, సినిమాలు, పాటలు, పాడ్‌కాస్ట్‌లు సహా మీడియా కంటెంట్ ఏదీ ఇక భారత్‌లో అందుబాటులో ఉండదు. సబ్‌స్క్రిప్షన్, సహా ఇతర మార్గాల ద్వారా కంటెంట్ పొందుతున్న వారికీ ఇందులో ఏ మినహాయింపు లేదు. ఓటీటీ వేదికలు పాకిస్థాన్ కంటెంట్‌ను భారత్‌లో స్ట్రీమింగ్ చేయడానికి వీల్లేదు' అని సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఆదేశించింది. తాజా నిర్ణయంతో నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, యూట్యూబ్, జియో సినిమా సహా అన్ని ఓటీటీ వేదికలు పాక్ కంటెంట్ స్ట్రీమింగ్‌ను భారత్‌లో నిలిపివేయాల్సిందే!

# 'మహాభారతం'.. కృష్ణుడిగా ఆమిర్ ఖాన్!

మహాభారతం సినిమాలో కృష్ణుడి పాత్ర చేయాలనుందని ఆమిర్ ఖాన్ తెలిపారు. తన కలల ప్రాజెక్ట్ 'మహాభారతం' గురించి ఆమిర్‌ఖాన్ మరోసారి మాట్లాడారు. తాను అందులో ఏ పాత్ర పోషించాలనుకుంటున్నారో వెల్లడించారు. దీంతో మరోసారి ఈ భారీ ప్రాజెక్ట్ వార్తల్లో నిలిచింది.

"మహాభారతం'ను తెరకెక్కించడం నా కల. దీనికోసం ఎంతో కష్టపడాలి. కానీ ఇలాంటి సినిమాలు ఎప్పటికీ నిరాశపరచవు. ఇందులో కృష్ణుడి పాత్ర నన్ను ఎంతో ప్రభావితం చేసింది. అది నాకు చాలా ఇష్టమైన పాత్ర. ఆ క్యారెక్టర్‌లో కనిపించాలనుకుంటున్నాను. ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్. నేను ఇప్పుడే దీని గురించి ఎక్కువగా వివరించలేను" అని చెప్పారు. గతంలోనూ ఆమిర్ దీని గురించి మాట్లాడారు. ఈ ఏడాది దీని పనులు ప్రారంభించాలనుకుంటున్నట్లు తెలిపారు. దీని రైటింగ్‌కు కొన్ని సంవత్సరాలు పడుతుందన్నారు. ఒకే సినిమాలో దీన్ని చూపించలేమని.. అందుకే సిరీస్‌లుగా దీన్ని అందించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

ఇక ఇదే ఇంటర్వ్యూలో ఆమిర్ మాట్లాడుతూ.. తాను నటించిన ఎన్నో సినిమాలకు రెమ్యూనరేషన్ తీసుకోలేదని అన్నారు. 'లాల్ సింగ్ చడ్డా'కు కూడా తీసుకోలేదని అన్నారు. "నా సినిమాలకు వచ్చే లాభాల్లో షేర్ తీసుకుంటాను. సినిమా హిట్ అయితేనే నాకు పేమెంట్ వస్తుంది. లేకపోతే ఏం ఉండదు. 'లాల్ సింగ్ చడ్డా'కు నాకు రూపాయి కూడా అందలేదు. అయినా ఆ విషయంలో బాధపడను. ఎందుకంటే ఇలా చేయడం సరైనదని నా అభిప్రాయం. సినిమా ఫ్లాప్ విషయంలో నేను కూడా బాధ్యత వహించాలి కదా అని నా ఆలోచన. 'షూటింగ్‌లో నేను ఇన్ని రోజులు పాల్గొన్నాను కాబట్టి.. సినిమా ఫలితంతో నాకు సంబంధం లేదు.. నా పారితోషికం నాకు ఇవ్వండి' అని నిర్మాతలను అడగలేను. అలాంటి నటుడిని కాదు నేను" అని ఆమిర్ చెప్పారు.



## పెళ్లైనా, రిలేషన్‌షిప్‌లో ఉన్నా.. వేర్వేరుగా:
# 'ల్యాట్'పై పూరి మ్యూజింగ్స్

**లివింగ్ అపార్ట్ టుగెదర్ గురించి దర్శకుడు పూరి జగన్నాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన ఏమన్నారంటే?**

తన యూట్యూబ్ ఛానల్ వేదికగా దర్శకుడు పూరి జగన్నాథ్ అభిమానులతో పలు విశేషాలు పంచుకుంటారనే సంగతి తెలిసిందే. 'పూరి మ్యూజింగ్స్' తాజా ఎపిసోడ్‌లో ల్యాట్ (లివింగ్ అపార్ట్ టుగెదర్) గురించి మాట్లాడారు. ఆయన చెప్పిన సంగతులివీ..

''మారుతున్న ప్రపంచంతోపాటు ప్రేమకు, పెళ్లికి అర్థాలు మారిపోతున్నాయి. ఇద్దరు కలిసి బతకడం ఈరోజుల్లో కష్టమైపోయింది. దాన్నుంచి వచ్చిందే ల్యాట్. అంటే.. పెళ్లైన వారు, రిలేషన్‌షిప్‌లో ఉన్నవారు దూరంగా వేర్వేరు ఇళ్లలో జీవించడం. చాలామంది పర్సనల్ స్పేస్ కోరుకుంటున్నారు. జీవితంలో బ్రేకప్స్, విడాకులు చూశాక ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు. వివాహం తర్వాత కూడా ఒక్కొక్కరు ఒక్కో దేశంలో నివసిస్తున్నారు. వేర్వేరు నగరాల్లో ఉద్యోగం చేస్తున్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లీదండ్రులు దూరంగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి''

''యూరప్, జపాన్‌లో ల్యాట్ రిలేషన్‌షిప్స్ ఎక్కువవుతున్నాయి. ఇద్దరూ ఒకే ఇంట్లో ఉండాలని సమాజం అనుకుంటుంది. కానీ, నేటి తరం స్వేచ్ఛకు ఎక్కువగా విలువ ఇస్తోంది. దూరంగా ఉంటే ప్రేమ, అనుబంధం పెరుగుతాయని నమ్ముతోంది. ల్యాట్ రిలేషన్‌లో ఉండాలంటే మానసికంగా పరిణతి చెందాలి. ఒకరిపై ఒకరికి గౌరవం ఉండాలి. ఎవరి కాళ్లపై వారు నిలబడాలి. 'మేం కలిసి ఉండకపోయినా.. కలిసి అభివృద్ధి చెందుతాం' అనేది వారి ఫిలాసఫీ''

''18 ఏళ్ల క్రితం విమాన ప్రయాణంలో నేను ఓ వివాహితతో మాట్లాడా. ఆమె భర్త గోవాలోని ఓ రెస్టారెంట్‌లో గిటారిస్ట్. ఆయన అక్కడే ఉంటాడు. ఆమె ప్రపంచ దేశాలు తిరుగుతుంటుంది. ఏడాదిలో ఒక్క నెల కలిసి ఉంటారు. తర్వాత మళ్లీ ఎవరి దారి వారిదే. అలా భర్తను కలిసేందుకు వెళ్లే క్రమంలోనే ఆమె నాతో మాట్లాడింది. తన భర్త గురించి ఎంతో గొప్పగా చెప్పింది. అమితమైన గౌరవం ఉన్నవారే అలా ఉండగలుగుతారు. అందరూ ల్యాట్‌లో ఉండాలని చెప్పడం లేదు. పెళ్లై ఒకే ఇంట్లో ఉంటున్న వారు ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి. ఇద్దరి మధ్య ప్రేమ చెరిగిపోకుండా ఉండాలంటే కాస్త ప్రైవసీ ఉండాలి'' అని పేర్కొన్నారు.





# ఎవరినీ సాయం అడగాలనుకోలేదు: సమంత

**'శుభం' ప్రచారంలో బిజీగా ఉన్నారు సమంత. ఇందులోభాగంగా ఆసక్తికర విషయాలు పంచుకోవడంతో ఆమె పేరు ట్రెండ్ అవుతోంది.**

తన నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'లో రూపొందిన తొలి సినిమా 'శుభం' ప్రచారంలో సమంత బిజీగా ఉన్నారు. మే 9న ఈ సినిమా విడుదల కానుంది. ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె వరుస ఇంటర్వ్యూలు ఇవ్వడంతో ఆమె పేరు ట్రెండ్ అవుతోంది. తన తర్వాతి సినిమా గురించి తాజాగా మాట్లాడారు. అలాగే ఆమె పంచుకున్న కొన్ని ఫొటోలు నెటిజన్‌లను ఆకర్షిస్తున్నాయి.

సమంత కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించి ఏడాది దాటింది. గతేడాది ఆమె పుట్టినరోజు నాడు 'మా ఇంటి బంగారం' అనే సినిమాను ప్రకటించారు. తాజాగా ఆ చిత్రంపై అప్‌డేట్ ఇచ్చారు. జూన్ నుంచి ఆ సినిమా సెట్స్ పైకి వెళ్లనున్నట్లు తెలిపారు. దీనితర్వాత వరుస ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకులను అలరించనున్నారు. దీంతో ఆమె తెలుగులో మరోసారి స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇస్తుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**అందుకే అతిథి పాత్ర..**

'శుభం'లో సమంత అతిథి పాత్రలో కనిపించనున్నారు. దీని గురించి ఆమె మాట్లాడుతూ.. ''నేను శుభంలో అతిథి పాత్ర పోషించాల్సింది కాదు. కానీ నిర్మాతగా నా తొలి చిత్రం కోసం నేను ఎవరినీ సాయం అడగాలనుకోలేదు. అందుకే నేనే నటించాను. సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లే బాధ్యతను కూడా నేనే తీసుకున్నాను. రిలీజ్ వరకు మాత్రమే ప్రచారం చేస్తాను. తర్వాత సినిమా పూర్తిగా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది'' అని చెప్పారు.

**కొత్త ఆరంభం..**

నటిగా తనని తాను నిరూపించుకున్న సమంత .. నిర్మాతగా అదృష్టం పరీక్షించుకోనున్నారు. 'శుభం' విడుదల సందర్భంగా ఆమె కొన్ని ఫొటోలు షేర్ చేశారు. ప్రస్తుతం ఆ ఫొటోలతో పాటు వాటికి ఆమె పెట్టిన క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. శుభం టీమ్‌తో పాటు దర్శకుడు రాజ్, దర్శకురాలు నందినిలతో దిగిన ఫొటోలను సమంత షేర్ చేశారు. ''ఇది చాలా కష్టమైన ప్రయాణం. ఇక్కడి వరకూ చేరుకున్నాం. ఇది కొత్త ఆరంభం'' అని క్యాప్షన్ పెట్టారు.



# రోహిత్ శర్మ స్థానాన్ని భర్తీ చేయడం కష్టం: కపిల్ దేవ్

**టెస్టులకు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంపై భారత మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ స్పందించాడు.**

టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ పర్యటనకు రోహిత్‌ను సారథిగా తప్పించబోతున్నారని వార్తలు వచ్చిన కొన్ని గంటల్లోనే అతను టెస్టుల నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటన చేయడం గమనార్హం. ఇప్పటికే టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్.. ఇక వన్డేల్లో మాత్రమే కొనసాగనున్నాడు. ఈ నేపథ్యంలో రోహిత్‌పై భారత మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ప్రశంసలు కురిపించాడు. 'రోహిత్ శర్మ ఆటగాడిగా, కెప్టెన్‌గా అద్భుతంగా జట్టును ముందుకు నడిపించాడు. మంచి క్రికెట్ ఆడాడు. అతను కెప్టెన్సీ చేసిన విధానం, ముఖ్యంగా అతను క్రికెట్ ఆడిన తీరు అద్భుతం. భారత క్రికెట్‌లో కొంతమంది మాత్రమే ఇలాంటి క్రికెట్ ఆడారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో కెప్టెన్ రోహిత్‌కు ప్రత్యామ్నాయం దొరకడం కష్టం. అద్భుతమైన కెరీర్‌కు వీడ్కోలు పలికిన రోహిత్‌కు అభినందనలు తెలియజేస్తున్నాను' అని కపిల్‌దేవ్ వెల్లడించాడు.

రోహిత్ 2027 ప్రపంచ కప్ ఆడతాడా? రోహిత్ శర్మ ఇకపై టీమ్‌ఇండియా తరఫున వన్డేల్లో మాత్రమే ఆడతాడు. హిట్‌మ్యాన్ 2024 టీ20 ప్రపంచ కప్ సాధించిన తర్వాత పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. రోహిత్ 2027 ప్రపంచ కప్ తర్వాతే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని అతని చిన్ననాటి కోచ్ దినేశ్ లాడ్ అన్నాడు. దీనిపై కపిల్ దేవ్ స్పందించాడు. 'ప్రతి ఒక్కరూ క్రికెట్ ఆడాలని కోరుకుంటారు. సచిన్, గావస్కర్‌తోపాటు ప్రతి ఒక్కరూ ఆడాలని కోరుకున్నారు. అయితే ఇది సెలక్టర్లపై ఆధారపడి ఉంటుంది. అతను (రోహిత్) ఆడాలని కోరుకుంటాడు. ప్రతి ఒక్కరూ ప్రపంచ కప్ ఆడాలని, గెలవాలని కోరుకుంటారు. అయితే కొన్ని విషయాలు సెలక్టర్లకు వదిలివేయాలి' అని కపిల్ దేవ్ పేర్కొన్నాడు.





# ధర్మశాలలో బ్లాక్ అవుట్..?

**పంజాబ్ కింగ్స్, ఢిల్లీ మ్యాచ్ రద్దు**

ఐపీఎల్2025లో భాగంగా ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరుగుతున్న మ్యాచ్ రద్దు అయింది. భద్రతా కారణాల దృష్ట్యా మ్యాచ్‌ను నిర్వాహకులు రద్దు చేశారు. భారత్‌పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తల నడుమ స్థానికంగా బ్లాక్ అవుట్ విధించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మ్యాచ్‌ను మధ్యలోనే ఆపేశారు.

ఐపీఎల్ చైర్మెన్ అరుణ్ ధుమాల్ స్వయంగా రంగంలోకి దిగి ప్రేక్షకులను స్టేడియం నుంచి బయటకు పంపించారు. జమ్మూలో జారీ చేయబడిన రెడ్ అలర్ట్ ఆధారంగా ముందు జాగ్రత్త చర్యగా ఈ మ్యాచ్‌ను రద్దు చేసినట్లు ధుమాల్ పేర్కొన్నారు. వర్షం కారణంగా గంట ఆలస్యంగా మొదలైన ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. పంజాబ్ స్కోర్ 10.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 122 పరుగులు చేసింది.

ప్రియాన్ష్ ఆర్య ఔటైన వెంటనే స్టేడియంలో ఫ్లడ్ లైట్స్ ఒక్కసారిగా ఆగిపోయాయి. దీంతో ఫ్లడ్‌లైట్ల సమస్య తలెత్తడంతో మ్యాచ్ ఆగిపోయిందని అంతా భావించారు. కానీ భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు ఉద్దేశ్యపూర్వకంగానే ఫ్లడ్ లైట్స్ ఆపి, మ్యాచ్ రద్దు చేశారు. అయితే టెక్నికల్ ఫెయిల్యూర్ కారణంగానే మ్యాచ్‌ని రద్దు చేస్తున్నట్టుగా బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. మ్యాచ్ రద్దు కావడంతో ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ జట్లకు చెరో పాయింట్ లభించింది.





# ఆయుశ్ మాత్రే నుంచి మయాంక్ అగర్వాల్ వరకు..!

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో గాయపడిన ఆటగాళ్ల సంఖ్య చాలా పెద్దగా ఉంది. గతంలో ఎన్నడూ లేనట్లుగా ఈ సీజన్‌లో 17 మంది ఆటగాళ్లు గాయాల బారిన పడ్డారు. వీరికి ప్రత్యామ్నాయ ఆటగాళ్లను ఆయా జట్లు ఇదివరకే ప్రకటించాయి. ప్రత్యామ్నాయ ఆటగాళ్లుగా వచ్చిన వారిలో చాలా మంది తుది జట్లలో చోటు దక్కించుకుని మ్యాచ్‌లు ఆడారు. కొందరికి ఇంకా అవకాశాలు రాలేదు. సీజన్ ప్రారంభానికి ముందే గాయాల కారణంగా వైదొలిగిన వారిలో హ్యారీ బ్రూక్, ఉమ్రాన్ మాలిక్ వంటి ఆటగాళ్లు ఉన్నారు. మిగిలిన ఆటగాళ్లు సీజన్ మధ్యలో గాయపడి లీగ్ నుంచి వైదొలిగారు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ నుంచి గాయాల కారణంగా వైదొలిగిన ఆటగాళ్లు..

**ఆర్సీబీ**
దేవ్‌దత్ పడిక్కల్- మయాంక్ అగర్వాల్ (రీప్లేస్‌మెంట్)

**సీఎస్‌కే**
రుతురాజ్ గైక్వాడ్- ఆయుశ్ మాత్రే
గుర్జప్‌నీత్ సింగ్- డెవాల్డ్ బ్రెవిస్
వన్ష్ బేడి- ఉర్విల్ పటేల్

**ముంబై ఇండియన్స్**
అల్లా ఘజన్‌ఫర్- ముజీబ్ రెహ్మాన్
లిజాడ్ విలియమ్స్- కార్బిన్ బాష్
విఘ్నేశ్ పుతుర్- రఘు శర్మ

**కేకేఆర్**
ఉమ్రాన్ మాలిక్- చేతన్ సకారియా

**గుజరాత్ టైటాన్స్**
గ్లెన్ ఫిలిప్స్- దసున్ షనక

**పంజాబ్ కింగ్స్**
గ్లెన్ మ్యాక్స్‌వెల్- మిచెల్ ఓవెన్

**లక్నో సూపర్ జెయింట్స్**
మొహిసిన్ ఖాన్- శార్దూల్ ఠాకూర్

**ఎస్ఆర్‌హెచ్**
బ్రైడన్ కార్స్- వియాన్ ముల్డర్
ఆడమ్ జంపా- స్మరణ్ రవిచంద్రన్
స్మరణ్ రవిచంద్రన్- హర్ష్ దూబే

**ఢిల్లీ క్యాపిటల్స్**
హ్యారీ బ్రూక్- సెదిఖుల్లా అటల్

**రాజస్థాన్ రాయల్స్**
నితీశ్ రాణా- లుహాన్ డ్రి ప్రిటోరియస్
సందీప్ శర్మ- నంద్రే బర్గర్

రీప్లేస్‌మెంట్ ఆటగాళ్ల ద్వారా అత్యధిక లబ్ది పొందింది సీఎస్‌కే. రీప్లేస్‌మెంట్‌గా వచ్చిన ఆయుశ్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్ జట్టులో స్థిరపడిపోయారు. వచ్చీ రావడంతోనే అవకాశం దక్కించుకున్న ఉర్విల్ పటేల్ కూడా తొలి మ్యాచ్‌లోనే సత్తా చాటాడు.



# ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ మీట్‌లో నీరజ్ చోప్రా

**న్యూఢిల్లీ:** భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా... వచ్చే నెలలో చెక్ రిపబ్లిక్‌లో జరగనున్న ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొననున్నాడు. గత రెండు సార్లు గాయాల కారణంగా ఈ టోర్నీకి దూరంగా ఉన్న నీరజ్ చోప్రా... జూన్ 24న జరిగే మీట్‌లో బరిలోకి దిగనున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన నీరజ్ చోప్రా...ప్రస్తుతం కొత్త కోచ్ జాన్ జెలెజ్నీ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు.

'ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ మీట్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ మీట్ కోసం ప్రాక్టీస్ చేస్తున్నా. నా కోచ్ జెలెజ్నీ గతంలో ఈ టోర్నీలో చాలా సార్లు విజేతగా నిలవడంతో పాటు... ఈవెంట్ డైరెక్టర్‌గానూ ఉన్నారు' అని నీరజ్ పేర్కొన్నాడు. 1961 నుంచి జరుగుతున్న ఈ మీట్‌కు ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య... గోల్డ్ లెవల్ మీట్ గుర్తింపునిచ్చింది.

ఈ నెల 16న దోహా డైమండ్ లీగ్‌లో పాల్గొననున్న ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణ పతక విజేత నీరజ్... ఈ నెల 24 భారత్‌లో తొలిసారి జరగనున్న 'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్‌లో పాల్గొననున్నాడు. బిజీ షెడ్యూల్ కారణంగా ఈ నెల 27 నుంచి 31 వరకు దక్షిణ కొరియాలో జరగనున్న ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ నుంచి నీరజ్ తప్పుకున్నాడు.



# ఐపీఎల్-2025లో ఓ మార్పు

**ఐపీఎల్-2025 లో భాగంగా ముంబై ఇండియన్స్-పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్ వేదిక మారింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఆదివారం (మే 11) ధర్మశాల వేదికగా ఈ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో వేదికను ధర్మశాల నుంచి అహ్మదాబాద్‌కు మార్చారు.**

**సిద్ధంగా ఉన్నాం**

గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ పటేల్ ఈ విషయం గురించి స్పోర్ట్‌స్టార్‌కు వెల్లడించారు. ''చివరి నిమిషంలో ధర్మశాల నుంచి వేదికను మార్చాల్సి వచ్చినపుడు.. బీసీసీఐ మమ్మల్ని సంప్రదించింది. మ్యాచ్ నిర్వహణకు మేము సిద్ధంగా ఉన్నామని వారికి సమాచారం ఇచ్చాము'' అని తెలిపారు.

కాగా ధర్మశాలలోని హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ పంజాబ్ కింగ్స్‌కు రెండో సొంత మైదానం. ఇక్కడ మూడు మ్యాచ్‌లు ఆడేందుకు షెడ్యూల్ ఖరారైంది. ఈ క్రమంలో ఇప్పటికే అక్కడ శ్రేయస్ సేన ఓ మ్యాచ్ ఆడింది. మే 3న లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడి 37 పరుగులు తేడాతో గెలిచింది.

ఇక ఈ రోజు అంటే మే 8న ఢిల్లీ క్యాపిటల్స్‌తో పంజాబ్ మ్యాచ్ ఆడుతుంది. ఈ క్రమంలో మే 11న ముంబై ఇండియన్స్‌ను ఢీకొట్టాల్సి ఉంది. అయితే, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రెండు రోజుల పాటు ధర్మశాల విమానాశ్రయాన్ని మూసివేశారు. దీంతో ముంబై ఇండియన్స్ జట్టు అక్కడికి ప్రయాణించే పరిస్థితి లేదు.

**వాంఖడేకు మారుస్తారనుకుంటే**

ఈ నేపథ్యంలో వేదికను ముంబైలోని వాంఖడేకు మారుస్తారని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, ఏ జట్టుకు హోం అడ్వాంటేజీ ఉండకూడదనే ఉద్దేశంతో వేదికను తటస్థంగా అహ్మదాబాద్‌కు మార్చినట్లు సమాచారం. నరేంద్ర మోదీ స్టేడియంలో మ్యాచ్ ఆడేందుకు ముంబై గురువారమే అక్కడికి చేరుకునే అవకాశం ఉండగా.. పంజాబ్ ఢిల్లీతో మ్యాచ్ ముగిసిన తర్వాత అక్కడికి చేరుకోనుంది

**భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు**

కాగా పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట ముష్కరులకు బుద్ధి చెప్పిన విషయం తెలిసిందే.పాకిస్తాన్,పాక్‌ఆక్రమితకశ్మీర్‌లో ఉన్న తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో దాయాది దేశాల మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఉగ్రవాద శిబిరాలపై దాడి నేపథ్యంలో పాకిస్తాన్ ఆర్మీ సరిహద్దుల వెంట కాల్పులకు తెగబడింది. మిసైళ్లతోనూ దాడి చేయగా భారత్ విజయవంతంగా తిప్పికొడుతోంది. ఈ క్రమంలో ధర్మశాలలో పంజాబ్ ఢిల్లీ మ్యాచ్‌కు భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేశారు.

**ఇదిలా ఉంటే..**

పంజాబ్ ఇప్పటికి పదకొండు మ్యాచ్‌లు పూర్తి చేసుకుని ఏడు గెలిచింది. ఓ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. దీంతో ప్రస్తుతం 15 పాయింట్లు కలిగి ఉన్న పంజాబ్.. పట్టికలో మూడో స్థానంలో ఉంది. మరోవైపు ముంబై నాలుగో స్థానంలో ఉండగా.. ఢిల్లీ క్యాపిటల్స్ ఐదో స్థానంలో కొనసాగుతోంది.